బలరాముడిగా భద్రాద్రి రామయ్య

బలరామావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న వైకుంఠ రాముడు

భద్రాచలం, జనవరి 7 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా 8వ రోజు మంగళవారం సీతారామచంద్రస్వామి బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారిని బలరామావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత నిత్య కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు స్వామివారికి వేద విన్నపాలు సమర్పించారు. ఆ తర్వాత మిథిలా స్టేడియానికి మేళతాళాలు, మహిళా భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. మిథిలా స్టేడియంలో ప్రత్యేక పూజల అనంతరం బలరామావతారంలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించుకుని తరించారు.

నేడు కృష్ణావతారం..

ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా 9వ రోజు బుధవారం సీతారామచంద్రస్వామి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పర్ణశాలలో..

దుమ్ముగూడెం, జనవరి 7: ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా పర్ణశాల రాముడు 8వ రోజు మంగళవారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారామచంద్ర స్వామిని బలరామావతారంలో భక్తులు దర్శించుకుని మంత్రముగ్ధులయ్యారు.

మహిళల జీవనోపాధికి ఆర్థిక వెసులుబాటు

యూనిట్లకు ఆర్థిక సాయం అందిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 7: గిరిజన మహిళల జీవనోపాధికి ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ఐటీడీఏ ఎప్పుడూ ముందుంటుందని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు, న్యూట్రిమిక్స్ యూనిట్, చిక్కి యూనిట్ లక్ష్మీనగరం, దాల్‌మిల్ యూనిట్ తుమ్మల చెరువులో నడుపుకుంటున్న గిరిజన మహిళల జీవనోపాధి నిమిత్తం యూనిట్‌కు రూ.5లక్షల చొప్పున మూడు యూనిట్లకు కలిపి రూ.15లక్షల చెక్కులను ఆ యూనిట్ మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎవో కరీం, జేడీఎం హరికృష్ణ, యూనిట్ల మహిళలు పాల్గొన్నారు.

భద్రాచలం, జనవరి 7: జిల్లా గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ సరఫరాకు షీల్డ్ షార్ట్ టెండర్లు కోరుతున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన టెండరుదారులు ఐటీడీఏ నుంచి 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మధ్యాహ్నం 3 గంటల వరకు టెండరు షెడ్యూల్ ఫారం పొందవచ్చని పేర్కొననారు.

భద్రాచలం, జనవరి 7: ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలు సులభతరంగా అవగతం చేసుకోవడానికి కంప్యూటర్లు ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయడం జరుగుతుందని ఈ మేరకు కంప్యూటర్ల టెండర్ ప్రక్రియను కమిటీ సభ్యుల సమక్షంలో మంగళవారం ఐటీడీఏ పీవో రాహుల్ తన చాంబర్‌లో ప్రారంభించారు. ఏసీఆర్ కంపెనీ 75, హెచ్‌పీ కంపెనీకి సంబంధించి 14 కంప్యూటర్లు మాత్రమే 20 ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయాలని, నిబంధనలు అతిక్రమించి ఇతర కంపెనీల కంప్యూటర్లు సరఫరా చేసినట్లు మా దృష్టికి వస్తే ఏజెన్సీలను రద్దు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పీవో పేర్కొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక, జనవరి 7: మండలంలోని అమరవరం గ్రామ పంచాయతీలో నిర్మించిన పలు సీసీ రోడ్లను మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పినపాక నియోజకవర్గానికి 4500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని అన్నారు. లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

ఎక్స్‌లెంట్‌కు బెస్టు ఇన్నోవేటివ్ స్కూల్ అవార్డు

మణుగూరు టౌన్, జనవరి 7: స్థానిక ఎక్స్‌లెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు 2024 సంవత్సరానికి బెస్ట్ ఇన్నోవేటీవ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ప్రకటించారు. మల్లారెడ్డి విశ్వవిద్యా పీఠ్ ఆధ్వర్యంలో హైబీజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్సీ అవార్డు 2024లో బెస్ట్ ఇన్నోవేటీవ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఎక్స్‌లెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ గెలుచుకున్నారు. హైదరాబాద్‌లోని సోవాటెల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ యూసఫ్ షరీఫ్ ఈ అవార్డును అందుకున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్రైంటు అయిన కాసాని పద్మ శేఖర్, తండ్రి : పుల్లారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలము, అశ్వారావుపేట గ్రామ కాపురస్తుడు మరియు లకంపాని వేంకటేశు, తండ్రి : నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, మల్లవరం గ్రామ కాపురస్తుడు అనువారు ది. 14-09-2024న ఈ దిగువ తెల్పబడిన "A" మరియు "B" షెడ్యూలు దాఖల ఆస్తులను కొనుగోలు చేయుటకు పట్టాదారు అయిన యర్రం మయూరి, భర్త : ప్రసాద్ అనువారి నుండి బయానా అగ్రిమెంటును వ్రాయించుకొనియున్నారు. సదరు యర్రం మయూరి అను వారు ది. 06-12-2021న అసలు పట్టాదారు అయిన ఉడా లక్ష్మీనారాయణ అను వారి నుండి "A" షెడ్యూలు దాఖల ఆస్తిని విక్రయ దస్తావేజు నెంబరు 117/2021 తాసీల్దార్ మరియు జాయింట్ SRO, అశ్వారావుపేట ద్వారా క్రయము పొందియున్నారు. మరియు ది. 21-05-2024న "B" షెడ్యూలు దాఖల ఆస్తిని సదరు యర్రం మయూరి అను వారు అసలు పట్టాదారు అయిన ఉడా సీతా, భర్త : లేటు సూర్యనారాయణ అను వారి ద్వారా విక్రయ దస్తావేజు నెంబరు 51/2024 తాసీల్దార్ మరియు జాయింట్ SRO, అశ్వారావుపేట ద్వారా క్రయము పొందియున్నారు. సదరు దిగువ తెల్పబడిన "A" షెడ్యూలు మరియు "B" షెడ్యూలు దాఖల ఆస్తులు వారసత్వ రీత్యా సదరు భూములకు అసలు పట్టాదారు అయిన లేటు ఉడా నాగరత్నం అను వారి నుండి పైన తెల్పబడిన ఉడా లక్ష్మీనారాయణ మరియు ఉడా సీతా, భర్త : లేటు సూర్యనారాయణ అను వారికి వారసులుగా సంక్రమింపబడియున్నది. దిగువ తెల్పబడిన ఆస్తి ఆస్తులపై ఎవరికి అయిన ఎటువంటి అభ్యంతరములు వున్న యెడల ఈ నోటీసు ఇచ్చిన వారము రోజుల లోపున తెలియపరచగలరు. పైన తెల్పిన విధముగా ఈ నోటీసు ఇచ్చిన వారము రోజులలోపు ఎటువంటి అభ్యంతరములు రాని ఎడల దిగువ తెలుపబడిన ఆస్తులకు సదరు పట్టాదారుకు అయిన ఉడా లక్ష్మీనారాయణ మరియు ఉడా సీతా అను వారికి సర్వ హక్కులు ఉండబడినవని భావించవలసివస్తుంది.

A-షెడ్యూలు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలము, అశ్వారావుపేట గ్రామమునకు సంబంధించిన వ్యవసాయ భూమి సర్వే నెంబరు 163/ఆ1 దాఖల య.5.00 కుంటలు కలిగిన భూమికి హద్దులు : **తూర్పు :** మద్దిరాల వేంకటేశ్వరరావు గారి భూమి, **పడమర :** సీమకుర్తి వేంకటేశ్వరరావు గారి భూమి, **దక్షిణము :** కోడూరి రాము గారి భూమి మరియు దారి, **ఉత్తరము :** ఉడా సీత గారి భూమి.

B-షెడ్యూలు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలము, అశ్వారావుపేట గ్రామమునకు సంబంధించిన వ్యవసాయ భూమి సర్వే నెంబరు 163/ఆ2 దాఖల య.2.20 కుంటలు కలిగిన భూమికి హద్దులు : **తూర్పు :** చక్రపు సరస్వతి గారి భూమి, **పడమర :** సీమకుర్తి వేంకటేశ్వరరావు మరియు ఉడా సీత గారి భూమి, **దక్షిణము :** యర్రం మయూరి గారి భూమి, **ఉత్తరము :** కొలకంపల్లి వెంకట రామారావు గారి భూమి.

ఇట్లు : **కొండపల్లి విజయకుమార్,**
అడ్వకేట్ – నోటరీ, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా.
Cell No : 9346962044
స్థలం: అశ్వారావుపేట
తే. 08-01-2025

ప్రకటన

మహారాజశ్రీ సత్తుపల్లి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు

O.S.No. 74/2020

BETWEEN :
IDBI Bank Ltd., Sathupally Branch
....వాది
మరియు
నారదాల వెంకటేశ్వరమ్మ
To, ... ప్రతివాది

నారదాల వెంకటేశ్వరమ్మ W/o.మాధవరావు, వృత్తి : వ్యవసాయం, R/o. H.No. 2-23, గణేశ్‌పాడు గ్రామం, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది పైన వ్యవసాయ రుణము బాపతు బాకీ ఉండినందున అట్టి బాకీ వసూలు నిమిత్తము రూ.1,31,316/- లకు దావాను దాఖలు చేసి వున్నారు.ప్రతివాది అయిన కారం సత్తిబాబు అను వారికి యెన్ని పర్యాయములు కోర్టు నోటీసులు పంపినను మీరు తీసుకొనక తప్పించుకొని తిరుగుతూ ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ఈ ప్రకటన జారీ చేయడము అయినది. సదరు దావా వాయిదా ది.20-01-2025 తేదిన ఉదయము 10.30ని॥లకు మీరు స్వయముగా గాని న్యాయవాది ద్వారా గాని సదరు పైన తెలిపిన కోర్టు వారి యెదుట హాజర్ అవ్వమని అశ్వంతరములు వున్న యెడల తెలియజేయగలరు. లేని యెడల మీ సమక్షమున తీర్మానము జరుగనని ఇందుమూలముగా తెలియచేయుటనైనది

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం//
కొండపల్లి విజయకుమార్
B.Com, LLB, అడ్వకేట్,
సత్తుపల్లి, ఖమ్మం జిల్లా, సెల్ :9346962044

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పర్యాటక ప్రాంతంగా కనిగిరి గుట్టలు

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

అధికారులు, గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చంద్రుగొండ, జనవరి7 : భవిష్యత్‌లో కనిగిరి గుట్టలు మంచి పర్యాటక ప్రాంతంగా మారే అవకాశం ఉన్నదని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. బెండాలపాడు అటవీ ప్రాంతాన్ని, బ్యాంబో క్లస్టర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ నెల 11న పర్యాటకుల బృందాలు బెండాలపాడుకు రానున్న నేపథ్యంలో కలెక్టర్ స్థానిక అధికారులు, గిరిజనులు, బ్యాంబో క్లస్టర్ యూనిట్ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఐకేపీ సభ్యులు తయారు చేసే వంటలను కలెక్టర్ స్వయంగా రుచి చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులను గిరిజనులు దగ్గర ఉండి ఈ ప్రాంతాన్ని అంతా చూపించాలన్నారు. ఈ ప్రాంతం గిరిజనులకు ఆదాయ మార్గంగా మారే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, బెండాలపాడు బ్యాంబో క్లస్టర్ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి ఏర్పాట్లు

భద్రాచలం, జనవరి 7: మరో రెండు రోజుల్లో ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉండడంతో ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం రాత్రి కలెక్టర్ ముక్కోటి ఏర్పాట్లలో భాగంగా కరకట్ట, గోదావరి ఒడ్డున రివర్ ఫెస్టివల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి గిరిజన మహిళలతో మాట్లాడారు. ముక్కోటికి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సారి ప్రత్యేకంగా రివర్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో భాగంగా గోదావరి ఒడ్డున గుడారాలు, గిరిజన స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముక్కోటికి వచ్చే ప్రతి భక్తుడు, పర్యాటకుడు గిరిజన కల్చర్‌ను తెలుసుకుని వెళ్లాలనేలా ఏర్పాట్లు జరిగాయన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : భూమాత మాడ్యూల్ అమలుకు ముందే సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు సమర్పించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న భూమాత పోర్టల్ అమలుకు ముందు తలెత్తే సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఐడీవోసీ నుంచి మంగళవారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దార్లు లిఖిత పూర్వకంగా నిర్దేశిత పట్టిక ద్వారా తెలియజేయాలని ఆదేశించారు. వచ్చిన సూచనలు, సలహాలను ఉన్నతాధికారులకు పంపడం ద్వారా మాడ్యూల్‌లో మార్పులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్న భూ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎమ్మెల్యే కూనంనేని

థర్డ్ సిటీగా సుజాతనగర్ అభివృద్ధి

సుజాతనగర్ రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో థర్డ్ సిటీగా సుజాతనగర్ అభివృద్ధి చెందబోతున్నదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుజాతనగర్ మండల అఖిలపక్షం నాయకులు రైతులు కలిసి ఎమ్మెల్యేకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగూడెం పాల్వంచ మాత్రమే జంట పట్టణాలుగా ఉండేవని, ఇప్పుడు కొత్తగూడెం కార్పొరేషన్‌తో మూడోపట్టణంగా సుజాతనగర్ కాబోతుందన్నారు. రిజిస్ట్రేషన్ భూములు కలిగి ఉన్న ప్రాంతంకావడం వల్ల సుజాతనగర్‌తోపాటు ఏడు పంచాయతీలను కార్పొరేషన్‌లో కలపడంతో భూముల విలువ పెరుగుతుందన్నారు. అఖిలపక్ష రైతులు లక్ష్మీనారాయణ, మన్నెపల్లి రైతు, మూడ్ గణేష్, కీసర బ్రహ్మానందరెడ్డి, తులసిరెడ్డి, తాళ్లూరి పాపారావు, ధర్మారావు, కే హన్మంతురావు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి, జనవరి 7: కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌ను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల మరింత అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద ఉన్న హరిత టూరిజం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు వల్ల గిరిజనులకు ఎలాంటి నష్టం జరగదని, వాళ్లకు ఉండాల్సిన చట్టాలు, హక్కులు వారికే ఉంటాయని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు కోసమే ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, రామవరంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు జరగడం వల్ల ట్యాక్సులు పెరుగుతాయని భయాందోళన అవసరం లేదని, నామినల్‌గానే ట్యాక్సులు ఉంటాయన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, జెడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, చౌదరి, మురళి, నాగేశ్వరరావు, సీతారాములు, పెదబాబు, మురళి, శ్రీను, జమలయ్య, దేవీప్రసన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

మణుగూరు టౌన్ : మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరు టౌన్, జనవరి 7: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల నేపథ్యంలో మణుగూరు పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు, వాహనదారులు అందరూ ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలన్నారు. పట్టణంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు.

నెంబర్ ప్లేట్ లేకుంటే వాహనం సీజ్

కొత్తగూడెం క్రైం, జనవరి 7 : వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుంటే సీజ్ చేస్తామని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై కొండపర్తి నరేష్ హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే 40 వాహనాలను స్వాధీనంలోకి తీసుకుని జరిమాన విధించడంతోపాటు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

అశ్వారావుపేటటౌన్, జనవరి 7: హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని ఎస్సై యయాతి రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు.

అశ్వారావుపేట, జనవరి 7: మండలంలో కోడి పందేలు, పేకాట వంటి జూదం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పాత నేరస్తులకు ఎస్సై యయాతి రాజు స్పష్టం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మూడేళ్ళలో పేకాట, కోడి పందేల కేసుల్లో ఉన్న నిందితులకు మంగళవారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం పాత నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు.

దమ్మపేట, జనవరి 7: మూడేళ్ల నుంచి దమ్మపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట, కోడిపందాల కేసుల్లో ఉన్న నిందితులకు, కోడి కత్తులు తయారుచేసి కోడికత్తులు కట్టేవారికి, పేకాట రాయుళ్లకు ఎస్సై సాయికిశోర్‌రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతంలో కేసులున్న 80 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

పాల్వంచ రూరల్, జనవరి 7 : ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని రూరల్ ఎస్సై సురేష్ అన్నారు. కిన్నెరసాని పంచాయతీ రాజాపురం క్రాస్ రోడ్డు వద్ద ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 7: ప్రమాదాల నివారణకు వాహనదారులు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రాజశేఖర్ స్పష్టం చేశారు. మండలంలోని జగన్నాధపురంలో ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భద్రాచలం, జనవరి 7: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించిన ఘటన మంగళవారం మధ్యాహ్నం భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్ కాలనీకి చెందిన రమేష్ ఇంట్లో తాళం వేసి ఉండగా మధ్యాహ్నం సమయంలో దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న బీరువాలో నగదు, బంగారం అపహరించి పరారయ్యారు. ఇంటికి వచ్చి చూసిన రమేష్, కుటుంబసభ్యులు రూ.1.50 లక్షలు, నాలుగు బంగారు ఉంగరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

బూర్గంపహాడ్, జనవరి 7: ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్క రజిత(36) ప్రైవేటు ఫైనాన్స్ వద్ద రుణం తీసుకుంది. తీసుకునన నగదు చెల్లించడానికి లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట

బూర్గంపహాడ్, జనవరి 7: మండలంలో అక్రమ ఇసుక రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేశారు. మండలంలోని పినపాక పట్టీనగర్, బుడ్డగూడెం గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతుండడంతో అధికారులు ఆయా ప్రాంతాలను గుర్తించి కిన్నెరసాని కాలువ సమీపంలోకి వెళ్లి సిబ్బందిచే కందకాలు తీయించి రవాణాకు అడ్డుకట్ట వేశారు. అక్రమ రవాణాకు పాల్పడితే ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

1104 యూనియన్ డైరీ ఆవిష్కరణ

పాల్వంచ, జనవరి 7: కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్ చేతుల మీదుగా టీఈఈ 1104 యూనియన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఇండ్ల సర్వే నిస్పక్షపాతంగా చేయాలి

పాల్వంచ రూరల్, జనవరి 7: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నిస్పక్షపాతంగా నిర్వహించాలని, వివరాలు పొందుపర్చడంలో తప్పులులేకుండా జాగ్రత్త వహించాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరు లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆళ్ళపల్లి, జనవరి 7 : మతిస్థిమితం భ్రమించిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగిన ఘటన ఆళ్ళపల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతోగు పంచాయతీ జిన్నెలగూడెం గ్రామానికి చెందిన వాగబోయిన భద్రయ్యకు కొంతకాలంగా మతిస్థిమితం సరిగాలేదు. మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగినట్లు కుటుంబసభ్యులు గుర్తించి స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి 108 ద్వారా తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

మణుగూరు టౌన్, జనవరి 7 : మణుగూరు డిగ్రీ కాలేజీ ఆవరణలో చెట్టుకు ఉరేసుకొని ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై మేడా ప్రసాద్ కథనం ప్రకారం.. మూడ్రోజులుగా రాత్రివేళ ఎందుకు తిరుగుతున్నావురా అని తండ్రి మందలించినందుకు ఆటోడ్రైవర్ మహేష్(20) ఆత్మహత్య చేసుకున్నాడు. చోరీ కేసులో మణుగూరులో బుధవారం కోర్టు వాయిదా ఉన్న నేపథ్యంలో వచ్చిన మహేష్‌ను తండ్రి మందలించడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మణుగూరు టౌన్, జనవరి 7 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న యువతి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మణుగూరులో సోమవారం రాత్రి చోటుచేసుకోగా, విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్షతగాత్రురాలిని స్థానిక ఆస్పత్రికి, అక్కడికి నుంచి భద్రాచలం, తర్వాత ఖమ్మం తరలించినట్లు సమాచారం. యువతి పనిచేస్తున్న ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి... మణుగూరు మండలం సమితిసింగారానికి చెందిన హిమబిందు శివలింగాపురం పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తోంది. గత కొంతకాలంగా ఏఎన్ఎంలకు ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు తరచూ గొడవలు జరుగుతున్నాయని, తరచూ తమ విధుల్లో జోక్యం చేసుకుంటూ పెత్తనం చెలాయిస్తోందని అంటూ స్థానిక వైద్యులకు ఫిర్యాదు చేయడంతోపాటు ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

మునగ సాగుపై అవగాహన

అశ్వారావుపేట రూరల్, జనవరి 7: మండల పరిధిలోని అనంతారం, గాండ్లగూడెం, వినాయకపురం, తిరుమలకుంట, మామిళ్లవారిగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా వేసిన మునగ పంటలను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఉపాధి ఏపీఎం రాంచంద్రరావుతో కలిసి పరిశీలించారు. వేసవిలో మొక్కల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఏఆర్ హెచ్‌సీ సత్కరించిన ఎస్పీ